నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి

10 | మహబూబ్‌నగర్, శనివారం 26 ఏప్రిల్ 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

పాలనలో రేవంత్ సర్కారు విఫలం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- బీఆర్ఎస్‌లో చేరిన హస్తం పార్టీ నాయకులు

బీఆర్ఎస్‌లోకి నేతలను సాదరంగా ఆహ్వానిస్తున్న మాజీ మంత్రులు

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 25 : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో.. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ సర్కారు పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి సమక్షంలో మహబూబ్‌నగర్ మం డలం ధర్మాపూర్ మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డిపాటు పట్టణంలోని 31వ వార్డుకు చెందిన 20 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైఫొద్దీన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మాజీ మంత్రులు గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇంత వరకు పాలనలో ఎలాంటి పురోగతి లేదన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీయించడంతోపాటు అన్నివర్గాల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని మండిపడ్డారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

మాజీ సర్పంచ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న గువ్వల

వంగూరు, ఏప్రిల్ 25 : ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి రాజభోగం అనుభవిస్తున్నారని, పాలనలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన మండలంలోని సర్వారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పుల్లయ్యయాదవ్, నర్సంపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అలివేల శ్రీశైలంయాదవ్ శుక్రవారం వంగూరులో గువ్వల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గువ్వల మాట్లాడుతూ సీఎం రే వంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సొంత గ్రామమైన కొం డారెడ్డిపల్లిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినా ఇప్పటి వరకు ఏ ఒక్కటీ పూర్తికాలేదని ఆరోపించారు. అభివృద్ధిని అటుంచితే ఇద్దరిని పొట్టనపెట్టుకున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గణేశ్‌రావు, నరేందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురేందర్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీపతిరావ్, జైపాల్‌రెడ్డి, రాజురావు, అంజి, జీవన్, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నాగేశ్, సత్యం తదితరులు ఉన్నారు.

జూపల్లి ఇలాకాలో కాంగ్రెస్‌కు షాక్

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి పలువురు

బీరం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

కొల్లాపూర్, ఏప్రిల్ 25 : మంత్రి జూపల్లి ఇలాకలోని కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం జూపల్లి సొంత మండలం చిన్నంబావికి చెందిన కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈదన్నయాదవ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి కొల్లాపూర్‌లో బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ బీరం మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు దొంగ హామీలిచ్చి అధికారంలో వచ్చిందన్నారు. కాలం గడిచేకొద్దీ కాంగ్రెస్ ముసుగు తొలుగుతోందని, ఈ క్రమంలోనే నాయకులు ఆ పార్టీని వీడి భవిష్యత్ ఉన్న బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండగా, కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలోనే అధోగతి పాలైందని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లో చేరిన ఈదన్నయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రగతి

- కారు పార్టీలో 60 మంది చేరిక

బీఆర్ఎస్‌లో చేరిన వారితో హనుమంతునాయుడు

ధరూరు, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రగతి సాధ్యమని పార్టీ గద్వాల నియోజకవర్గ నేత హనుమంతునాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నపాడు, ఎములోనిపల్లి గ్రామాలకు చెందిన యువకులు, పెద్దలు 60మందికి పైగా బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి తన నివాసంలో హనుమంతునాయుడు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా కొట్లాడి రాష్ట్రాన్ని సాధించిన మహానుభావుడు కేసీఆర్ అన్నారు. అనంతరం ఎములోనిపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్, లక్ష్మణ్, విష్ణు, ప్రవీణ్, శివ, దండుగోపాల్, మహానంది, ఆంజనేయులు, కురుమన్న, గోపాల్, సాయిరాములు, మహేశ్, రవి, గోవిందు, కోటి, సవారన్న, చిన్నపాడుకు చెందిన కోట్ల సవారన్న, రంగస్వామి, బస్వరాజు పార్టీలో చేరారు.

అన్నదాతల ఆక్రోశం

- గన్నీ బ్యాగుల కోసం రాయిచూరు జాతీయ రహదారిపై ఆందోళన

రోడ్డుపై కంపవేసి ఆందోళన చేస్తున్న రైతులు

పాలమూరు, ఏప్రిల్ 25 : ఆరుగాలం కష్టించి పండించిన పంట అరకొరగా చేతికిరాగా, అమ్ముకుందామంటే సర్కారు ముప్పతిప్పలు పెడుతున్నదని, కనీసం గన్నీ బ్యాగులు కూడా ఇవ్వడం లేదంటూ అన్నదాతలు ఆగ్రహించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోటకదిర ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద 10 రోజులుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం నింపడానికి గన్నీ బ్యాగుల కొరత ఏర్పడింది. రైతులు ప్రతి రోజూ గంటల తరబడి బ్యాగుల కోసం వేచి చూసినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆగ్రహించిన రైతులు శుక్రవారం అప్పాయపల్లి గ్రామం వద్ద గల రాయచూరు రహదారిపైకి వచ్చి వాహనాలను నిలిపి నిరసన చేపట్టారు. వెంటనే గన్నీ బ్యాగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు, సర్కారు నిర్లక్ష్యం వహిస్తూ నిండా ముంచుతున్నారని మండిపడ్డారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న తాసీల్దార్ సుందర్‌రాజు, ఎస్సై విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. గన్నీ బ్యాగులు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

తాగునీటి కోసం గిరిజనుల ఆందోళన

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

చారకొండ, ఏప్రిల్ 25 : అసలే వేసవి.. ఓ పక్క మండే ఎండలు.. మరో పక్క తాగునీటి కోసం గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని అగ్రహారంతండాలో శుక్రవారం తాగునీటి కోసం ఖాళీ బిందెలతో గిరిజన మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. పైపులైన్ లీకేజీలు కావడంతో నీళ్లు సరిగా రావడం లేదని, తండాలో ఉన్న బోరు మోటర్లు చెడిపోవడంతో మరమతులు చేసే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు తమ గోడు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా నీటి సరఫరా చేయకపోవడంతో నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. గిరిజనుల ఆందోళనతో ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్, ఎంపీవో వెంకటేశ్, మిషన్‌భగీరథ ఏఈ రితీశ్ స్పందించారు. తండాలో తాగునీటి సమస్యపై ఆరా తీసి పైపులైన్ మరమ్మతులు చేయించారు. తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతామని చెప్పడంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

కేటీఆర్‌ను కలిసిన ఉప్పల వెంకటేశ్

కేటీఆర్‌ను కలిసిన వెంకటేశ్, పలువురు నాయకులు

కల్వకుర్తి, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ కలిశారు. వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనసమీకరణ ఏర్పాట్లపై కేటీఆర్ సూచనలు చేసినట్లు తెలిపారు. కలిసిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్, వెంకట్‌రెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షుడు గణేశ్, బుచ్చిబాబు, వంశీ ఉన్నారు.

రజతోత్సవానికి రెడీ

- ఒక్కో నియోజకవర్గం నుంచి 3 వేల మంది నేతల తరలింపునకు యత్నం
- తలమునకలైన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు
- వాహనాలు, ఏర్పాట్లపై కసరత్తు
- సభ వద్ద ఉమ్మడి జిల్లాకు జోన్-2లో పార్కింగ్
- నేడు, రేపు రెపరెపలాడనున్న బీఆర్ఎస్ జెండాలు



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను తరలివెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అలంపూర్ ఎమ్మెల్యేతోపాటు ఇతర ప్రజా ప్రతినిధులు ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహించారు. ప్రతి నియోజకవర్గం నుంచి 3వేల మంది కార్యకర్తలను వరంగల్ సభకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు వాహనాలు, భోజనం ఇతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లతో గులాబీమయంగా మారిపోయాయి. సొంత వాహనాల్లో స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు కార్యకర్తలు సంసిద్ధమవుతున్నారు. శని, ఆదివారాల్లో అన్ని గ్రామాల్లో జెండా పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గం నుంచి 300 వాహనాలు

ఉమ్మడి జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం నుంచి 3వేల మంది కార్యకర్తల కోసం దాదాపు 300 వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో వాహనానికి ఇన్‌చార్జితోపాటు భోజన సౌకర్యం, తాగునీటి వసతి కల్పించి కార్యకర్తలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు నేతలను ఇన్‌చార్జీలను నియమించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చే వాహనాలన్నీ ఇటు శంషాబాద్, అటు పాల్మాకుల దాటాక ఔటర్ రింగ్ రోడ్డుపైకి చేరుకొని నేరుగా వరంగల్ హైవేలో దిగొచ్చు. కొన్ని నియోజకవర్గాల నాయకులు ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో భోజనాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ప్రతి వాహనానికి నియోజకవర్గ స్టిక్కర్ ఏర్పాటు

సభకు తరలి వెళ్లేందుకు సిద్ధం చేస్తున్న ప్రతి వాహనానికి వాహన సంఖ్య, ఇన్‌చార్జి పేరు, సెల్‌నెంబర్‌తో స్టిక్కర్ ఏర్పాటు చేయనున్నారు. ఆయా ఇన్‌చార్జీలు లొకేషన్‌ను కూడా నియోజకవర్గ ఇన్‌చార్జి కి షేర్ చేసి వాహనాలు ఎక్కడి నుంచి ఎక్కడికి వె ళ్తున్నాయో పూర్తిస్థాయిలో మానిటరింగ్ చేసేందు కు పార్టీ నాయకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. వెళ్లిన ప్రతి వాహనం తిరిగి గమ్యస్థానికి చేరే వరకు ఇన్‌చార్జీలు మానిటరింగ్ చేయనున్నారు.

50వేల జన సమీకరణకు కసరత్తు

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 13నియోజకవర్గాల నుంచి సుమారు 50వేల మందిని సమీకరించేందుకు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, నాయకుల సొంత వాహనాల్లో ప్రయాణించేందుకు సిద్ధం చేశారు. ఎంపిక చేసిన వాహనాలను ఆయా గ్రామాలకు పంపించి కార్యకర్తలను తరలించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

జోన్-2లో ఉమ్మడి జిల్లాకు పార్కింగ్

రజతోత్సవ సభకు తరలివచ్చే ఉమ్మడి జిల్లా కార్యకర్తలు, నాయకులకు జోన్-2లో వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. వరంగల్ జాతీయ రహదారిలో టోల్‌గేట్ దాటాక కరుణాపురం వద్ద జాతీయ రహదారి-163 బైపాస్‌లో దేవన్నపేట్, మేడిపల్లి, అనంతసాగర్ నుంచి పార్కింగ్ ఏరియాకు వెళ్లవచ్చు. అన్ని వాహనాలను అక్కడే పార్కింగ్ చేసి సమీపంలో ఉన్న సభా వేదిక వద్దకు నేరుగా చేరుకోవచ్చని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ సభ ఏర్పాట్ల పరిశీలనలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

సభాస్థలాన్ని పరిశీలించిన నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 25 : ఈనెల 27వ తేదీన వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభా స్థలాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. వనపర్తి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో కలిసి ఆయన సభ స్థలానికి చేరుకొని బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడానికి రూట్ మ్యాప్‌ను మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డితో కలిసి పరిశీలించి మాట్లాడారు. దేశ రాజకీయంలో వరంగల్ సభ చారిత్రాత్మకంగా నిలుస్తుందని, ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి తరలివచ్చే బీఆర్ఎస్ శ్రేణులకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేసీఆర్ ఎన్నో చారిత్రాత్మక సభలు నిర్వహించారని, ఈ సభతో తన రికార్డును తానే మరోసారి రుజువు చేసుకోబోతున్నారన్నారు. 10లక్షల మందికి తగ్గకుండా ఉండే ఈ సభకు ఎన్నో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నాయకులు మాణిక్యం, కృష్ణయ్య, లక్ష్మారెడ్డి, రఘుపతిరెడ్డి, సురేశ్‌రెడ్డి, విజయ్ కుమార్, స్వామి, చౌమ్యానాయక్, శశివర్ధన్‌రెడ్డి, కుమార్‌యాదవ్, ఎల్లారెడ్డి, రమేశ్ ఉన్నారు.

సభకు భారీగా తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- సభ పోస్టర్లు అతికించిన చిట్టెం


సభ గోడపత్రికను అతికిస్తున్న చిట్టెం

మక్తల్, ఏప్రిల్ 25 : ఈనెల 27న వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మక్తల్ మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను అతికించి విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన కోసం స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కొట్లాడి సాధించిన రాష్ట్రాన్ని కేసీఆర్ పదేండ్లలో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిన్న హన్మంతు, గాల్‌రెడ్డి, శంకర్, మారుతి గౌడ్, అన్వర్ హుస్సేన్, మన్నన్, అమ్రేశ్, సత్య ఆంజనేయులు, ఆనంద్, సాధిక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు గులాబీ జెండా ఎగరాలె : లక్ష్మారెడ్డి

జడ్చర్ల, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో శనివారం గులాబీ జెండాను ఎగరవేయాలని మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉదయం 8గంటలకు జెండాను పండుగ వాతావరణంలో ఎగరవేయాలన్నారు. పట్టణ, మండల, గ్రామ, వార్డు అధ్యక్షులు, మాజీ ప్రతినిధులు, కౌన్సిలర్లు, పీఏసీసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు, యువకులు, కేసీఆర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వరంగల్ జనజాతర కావాలి

- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- పాలమూరులో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం
- హాజరైన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- ఉగ్రదాడి మృతులకు సంతాపం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 25 : తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించారని.. అటువంటి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని.. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు పాలమూరు నుంచి జనం దండులా కదిలిరావాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో గల బీఆర్ఎస్ కార్యాలయంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో పార్టీ జెండాను ఎగరవేసి పండుగ వాతావరణంలో సంబురాలు నిర్వహించాలన్నారు. అనంతరం వరంగల్ సభకు జాతరలా తరలిరావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలు నిర్వహించేందుకు సర్కారు వెనుకడుగు వేస్తున్నదని, అవసరమైతే కోర్టును ఆశ్రయించి ఎన్నికలు నిర్వహించేలా చూస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా కష్టకాలంలో కూడా రైతుల నుంచి ధాన్యం సేకరించి డబ్బులు అందించామని, కానీ ప్రస్తుత సర్కారు కనీసం గన్నీ బ్యాగులు కూడా ఇవ్వకుండా రైతులను అష్టకష్టాలకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికే సాగునీళ్ల లేక, పర్యావరణ పరిస్థితుల కారణంగా సర్వం కోల్పోయి కొద్దో గొప్పో మిగిలిన ధాన్యానికి ఫలితం దక్కకుండా సర్కారు నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అధిక సంఖ్యలో తరలిరావాలి : లక్ష్మారెడ్డి

గులాబీ పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. పాలమూరు జిల్లా నుంచి తండోపతండాలుగా తరలివచ్చేందుకు జనం సిద్ధమవుతున్నారని, గ్రామాల్లోకి వెళితే వచ్చే స్పందనను చూస్తే ఇట్టే అర్థమవుతున్నదన్నారు. అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ అసమర్థతను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

రాబోయేది బీఆర్ఎస్ సర్కారే : మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అత్యధికంగా ఎమ్మెల్యేలు గెలిచినా, సీఎం పాలమూరు జిల్లావాసి అయినా కూడా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కృషి, ప్రజలు మాపై పెట్టుకున్న అభిమానంతో ఎమ్మెల్సీగా నవీన్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకున్నామని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలన్నారు. రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని కోరారు.

జోష్ పెంచాలి : ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి తిరిగి గులాబీ జోష్ పెంచాలని ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉన్నదని, రానున్న కాలంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని చెప్పారు.

ఉగ్రదాడి పిరికిపంద చర్య..

జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి పిరికిపంద చర్యగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటన ఎంతో దురదృష్టకరమని, ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రహెమాన్, మాజీ జెడ్పీటీసీలు వెంకటేశ్వరమ్మ, నరేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, గణేశ్, దేవేందర్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, ఆంజనేయులు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాలమూరులో సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

విద్యార్థిపై హెచ్‌ఎం దాడి : విరిగిన చేయి

- పోలీసులను ఆశ్రయించిన స్టూడెంట్ తల్లిదండ్రులు
- విచారణ జరుపుతున్న పోలీసులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 25 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బాలచంద్రుడు ఆరో తరగతి చదువుతున్న పాత్లావత్ వినోద్ అనే విద్యార్థిని కొట్టడంతో చేయి విరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థి తల్లిదండ్రులు జమున, భాస్కర్, ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న వినోద్ ఈనెల 14వ తేదీన తోటి విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలోని వాటర్ ట్యాంకులో ఈత కొడుతుండగా.. హెచ్‌ఎం బాలచంద్రుడు కోపంతో వెదురుబొంగు కట్టెతో ఈత కొడుతున్న విద్యార్థులపై దాడి చేశారు. ఈ దాడిలో వినోద్ అనే విద్యార్థి చేయి విరిగింది. తీవ్ర గాయంలోనూ విద్యార్థి అలాగే పరీక్షలు రాశాడు. 23న పాఠశాలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థి సొంత ఊరైన గోప్యాతండాకు వెళ్లాడు. 24న అతడి తల్లిదండ్రులు జమున, భాస్కర్.. ఏమైందని విద్యార్థిని ప్రశ్నించగా.. విషయం చెప్పాడు. గురువారం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా స్కానింగ్ చేసిన డాక్టర్లు వినోద్‌కు చెయ్యి విరిగిందని తెలిపారు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన తల్లిదండ్రులు శుక్రవారం హెచ్‌ఎంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు ఎస్సై విక్రమ్ వెల్లడించారు.